## మళ్లీ డస్ట్‌బిన్లు..

### పేరుకుపోతున్న చెత్త

### తలెత్తనున్న పారిశుధ్య సమస్య..



రాంనగర్‌లో ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లు

ముషీరాబాద్, మే 25 : డస్ట్ బిన్‌లు మళ్లీ బస్తీ కూడళ్లలో ప్రత్యక్షమవుతున్నాయి. గత ప్రభుత్వం కూడళ్లలో చెత్త కుప్పల డస్ట్ బిన్‌లను తొలగించి డస్ట్‌బిన్ ఫ్రీ సిటీగా మారిస్తే.. ఈ ప్రభుత్వంలో మళ్లీ డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కూడళ్లు, డంపింగ్ ప్రాంతాల్లో ఇష్టం వచ్చినట్టు చెత్త పడేస్తున్నారు. డస్ట్ బిన్లు ఏర్పాటు చేయడం వల్ల కూడళ్లలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోతుంది. గతంలో డస్ట్ బిన్ ఫ్రీ సిటీగా చేయడానికి జీహెచ్‌ఎంసీ అధికారులు వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. చెత్త వేసే పాయింట్లు, డంపింగ్ పాయింట్లలో చెత్త వేయకుండా చేయడానికి డస్ట్‌బిన్‌లు తొలగించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేసి, ముగ్గులు వేసి, చెత్త రహిత ప్రాంతాలుగా మైక్‌ల్లో ప్రచారం చేసి బస్తీ లు, కాలనీలను చెత్త రహిత కాలనీలుగా తీర్చిదిద్దారు. ఇటీవల జీహెచ్‌ఎంసీ మళ్లీ డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయడం వల్ల పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంతవరకు చెత్త రహిత ప్రాంతాలుగా ఉన్న బస్తీల్లో మళ్లీ పారిశుధ్య సమస్య తలలెత్తనుంది. డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయడం వల్ల పౌరులు ఇష్టం వచ్చినట్లు చేత్త పడేస్తున్నారు. ఆటోరిక్షాలు, రిక్షాలకు వేయాల్సిన చెత్తను డస్ట్ బిన్లలో పడేస్తున్నారు. ఇటీవల జీహెచ్‌ఎంసీ డస్ట్‌బిన్లు కొనుగోలు చేసి పలుబస్తీల్లో ఏర్పాటు చేసింది. దీనివల్ల పరిశుధ్య సమస్యలు ఏర్పడుతున్నాయి.

# విద్యాభివృద్ధికి సింగరేణి సహకారం..

- సీఎండీ బలరామ్..
- సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన భవనం ప్రారంభం



ఈసీఈ భవనాన్ని ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం, వీసీ కుమార్ మొలుగారం

సికింద్రాబాద్, మే 25: వందేళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఉస్మానియా యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో తరగతి గదుల నిర్మాణానికి సహకరించడం తమ సంస్థకు ఎంతో గర్వకారణంగా ఉందని సింగరేణి సీఎండీ బలరామ్ పేర్కొన్నారు. తెలంగాణలో విద్యా రంగాన్ని ఆధునికీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సింగరేణి సంస్థ తెలంగాణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి తన వంతు సహకారాన్ని ఎప్పుడూ అందిస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ శాఖలో దాదా పు రెండు కోట్ల రూపాయల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన తరగతి గదుల కాంప్లెక్స్‌ను యూనివర్సిటీ ఉప కులపతి కుమార్ మొలుగారంతో కలిసి ఆయన ప్రారంభించారు. సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించడానికి కూడా పూర్తిస్థాయిలో సహకరించిందని, అలాగే ప్రస్తుత ఉస్మానియాలోని మైనింగ్ ఇంజి నీరింగ్ విభాగంలో సింగరేణి తరపున అధ్యాపకులను కేటా యించిందని, ప్రొఫెసర్ చైర్ పథకం కింద నిధులు కూడా కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇవే కాకుండా పెద్దపల్లి జిల్లాలో జేఎన్టీయూ కళాశాల ఏర్పాటుకు పూర్తి సహకారం అందించినట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉప కులపతి కుమార్ మొగులారం మాట్లాడుతూ... 13 దశాబ్దాల చరిత్ర గల సింగరేణి సంస్థ తెలంగాణ ప్రాంతానికి గర్వకారణమని, ఉస్మానియా యూనివర్సిటీకి సింగరేణి అందించిన ఆర్థిక సహాయం మరువలేనిదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో మైనింగ్ బోధన తిరిగి ప్రారంభించేందుకు కూడా పూర్తి సహకారం అందించిందని కొనియాడారు. ఇకపై కూడా సింగరేణి తన సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, ఓయూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంగు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్, ఈసీఈ విభాగ అధిపతి ప్రొఫెసర్ డి.రామకృష్ణ, సింగరేణి అధికారులు శ్రీ ఎన్.భాస్కర్, శ్రీ జి.రమేశ్, శ్రీ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీనివాస కల్యాణం ..



వైశాఖ బహుళ త్రయోదశిని పురస్కరించుకొని ఆదివారం రాంనగర్ డివిజన్, జెమినీ కాలనీ పోచమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ పంతులు వేద మంత్రోచ్చరణల నడుమ శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు తులసి మొక్కలు, లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

*– ముషీరాబాద్, మే 25*

## ఉచిత వైద్య శిబిరం .. ముందులు పంపిణీ




వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న నరసింహమూర్తి, క్రాంతికిశోర్‌లు

సికింద్రాబాద్, మే 25 : ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి అన్నారు. ఆదివారం లాలాపేట్‌లోని సీబీఎన్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో జనహిత సేవా ట్రస్ట్, బ్లూ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ డాక్టర్లు 175 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి.. ఆరోగ్య సలహాలు, మందులు అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ ఒంటినొప్పులు ఉన్నవారికి ఎక్సర్‌సైజ్‌లు చూపించారు. ఈ శిబిరంలో బ్లూ ఫౌండేషన్ డైరెక్టర్ క్రాంతి కిశోర్, సిబ్బంది డానియల్, రేణుక, ఉష, జనహిత క్యాంపు కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు, కిమ్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ విక్రమ్ పాల్గొన్నారు.




అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

## నారాయణపూర్ ఎన్‌కౌంటర్ బూటకం

### తెలంగాణ పౌరహక్కుల సంఘం నాయకులు

కవాడిగూడ, మే 25 : చత్తీస్‌గఢ్, నారాయణపూర్ ఎన్‌కౌంటర్ బూటకమని, ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని పౌరహక్కుల సంఘం తెలంగాణ, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలని, ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ పౌరహక్కుల సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావులు మాట్లాడుతూ .. ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించినప్పటికీ మృతదేహాలను ఇవ్వకుండా నిరాకరించడం సరికాదన్నారు. కోర్టు ఆదేశాలను దిక్కరిస్తున్న అధికారులను శిక్షించాలన్నారు. శవాలపై ప్రతీకార చర్యలను చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మానుకోవాలన్నారు. కుటుంబ సభ్యులను హింసించవద్దని, కోర్టు ఆదేశాలను పాటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం తెలంగాణ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అనాథలకు అన్నదానం



నగరంలో రోడ్ల పక్కన, ఆకలితో ఉన్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారిని గుర్తించి 277వ అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవకుమార్, ఉపాధ్యక్షురాలు పావనీ తెలిపారు. ప్రభుత్వం అలాంటి వారికి ఉపాధి, ఆశ్రయం కల్పించాలని వారు కోరారు.

*– బన్సీలాల్ పేట్, మే 25*

## నీల మేఘ శ్యామ నృత్యరూపకం

రవీంద్రభారతి, మే 25: ప్రముఖ కూచిపూడి నృత్యకళా సంస్థ సుమధుర ఆర్ట్స్ అకాడమీ సమర్పణలో గురు శ్రవ్యమానస ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుక సందర్భంగా దాదాపు 200 మంది విద్యార్థులు ప్రదర్శించిన నీల మేఘశ్యామ నృత్యరూపకం వీక్షకులను ఆకట్టుకున్నది. ఆదివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో అంగరంగ వైభవంగా ఈ నృత్యరూపక ప్రదర్శన జరిగింది. కృష్ణ భగవానుని లీలామృతంలోని కొన్ని ముఖ్యఘట్టాలను గురు శ్రవ్యమానస భోగిరెడ్డి తన శిష్యబృందంతో అద్భుతంగా రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా శిల్పారామం ప్రత్యేక అధికారి, రిటైర్డ్ ఐఎఎస్ జి.కిషన్‌రావు,స్టేట్ ఆర్ట్ గ్యాలరీ మేనేజర్ డైరెక్టర్ కె.లక్ష్మి ఐఎఎస్), ప్రముఖ సినీ టీవి దర్శక నిర్మాతలు, నటీనలు పాల్గొని కలాకారులందరినీ, గురు శ్రవ్య మానసనని, తన శిష్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సంస్థ పక్షాన గురు శ్రావ్య మానస అతిథులను సత్కరించారు.గురు,శ్రవ్య మానస వందన సమర్పణతో నీలమేఘవ్యామ ప్రదర్శన అంగరంగ వైభవంగా ముగిసింది.




నాట్యకారులతో వంశీ రామరాజు

## ఆకట్టుకున్న భరతనాట్య అరంగేట్రం

ముషీరాబాద్, మే 25: సురభి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ భరత నాట్య గురువు వినీత శ్రీనందన్ శిష్యులు ధృతి సుహానీ, ఆరాధ్య, అద్వైత, కృషి భరత నాట్య అరంగ్రేటం త్యాగరాయ గానసభలో ఆదివారం కన్నుల పండుగగా జరిగింది. తొలి అంశం గణేశ్ కౌతంతో ఆరంభించి.. భర త నాట్య కళాకారులకు పరీక్ష వంటివైన అలరేపు, జతి స్వరం, శబ్ధం, వర్ణం అంశాలు పదముద్రలులో మెలుకువలు అభినయ పూర్వకంగా నర్తించారు. గురువు వినీత, కృష్ణన్‌తో కలిసి నాట్యం చేయగా సురేశ్‌బాబు గాత్రం లయ బద్ధంగా ఉంది.

ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంత గ్రామం పాల్వంచకు చెందిన నలుగు రు బాలికలు భరత నాట్యంలో పుణేకు చెంది న వినేత వద్ద భరత నాట్యంలో శిక్షణ పొందటం విశేషం అన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



రామంతాపూర్, మే 25: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం గురువు పావని శ్రీలత ప్రసాద్ శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. రంగ పూజ, విన్నపాలు, పుష్పాంజలి, ఇదిగో భద్రాద్రి, శాంకరి శంకరుడు, నమశ్శివాయ, హిమగిరి, రామాయణ శబ్దం తదితర అంశాలను విముక్త, సుహాని, నిద్విక, శాన్వి, చైత్ర, జెశ్విత, దేవి లత, మాధవి, ఆద్య, తరుణి, అడవిత, సమన్విత, హంసిని ప్రదర్శించి ఆహుతులను మెప్పించారు.

## ఫుట్ పాత్ పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, మే 25: అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి ఫుట్ పాత్ పై మృతి చెందిన సంఘటన కాచిగూడ పిఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హెచ్.నరేష్ వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి(45) ఆదివారం సాయంత్రం హ్రస్ పెంటలోని గ్రేవీ యార్డ్ సమీపంలో గల ఫుట్ పాత్ పై అనారోగ్యంతో మృతి చెంది ఉన్నాడు.స్థానికుల సమాచారం మేరకు కాచిగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృత్తిని వంటిపై కుడి చేతిపై త్రిశూలం పుట్టుమచ్చ కలిగి ఎత్తు 5.0, నీలిరంగు ప్యాంటు, గ్రే రంగు చొక్కా, ధరించి ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. వివరాలకు 8712 660545 లో సంప్రదించాలని కోరారు.

## బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

కాచిగూడ, మే 25: కేంద్ర ప్రభుత్వం బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లను కల్పించాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నింబోలి అడ్డ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 56% బీసీలు ఉంటే ప్రభుత్వ రంగంలో 12 శాతం, ప్రైవేట్ రంగంలో 6 శాతానికి మించి లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగంలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు.

## ఘనంగా మల్లయ్య జయంతి..



మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గంగపుత్ర సంఘం నేతలు

సికింద్రాబాద్, మే 25: తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం మాజీ అధ్యక్షుడు ఏఎల్ మల్లయ్య జయంతి వేడుకలను సికింద్రాబాద్‌లో గంగపుత్ర సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. నామాలగుండులోని గంగపుత్ర సంఘం వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో మల్లయ్య చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగపుత్ర జాతి కోసం మల్లయ్య చేసిన సేవలను కొనియాడారు. ఆయన బాటలోనే యువకులు నడవాలని పిలుపునిచ్చారు. గంగపుత్ర సంఘానికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎర్రబోయిన మల్లేశ్, మోసం రాజలింగం, పాక గాలేశ్, కట్కూరి అశోక్, మూట గణేశ్, రాచమల్ల కృష్ణమూర్తి, రాచమల్ల స్వర్ణలత, ఆంజనేయులు, బుచ్చమ్మ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## ద్రావిడ సంఘం నూతన కార్యవర్గం ..



కోనసీమ ద్రావిడ సంఘం 95 వార్షికోత్సవ మహాసభలు, సర్వసభ్య సమావేశం ఆదివారం చిక్కడపల్లిలో జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వడ్లమాని బాలామణి, ఆదిభట్ల కామేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా బండి శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎంపికైనట్లు సంఘం నేతలు తెలిపారు.

*– ముషీరాబాద్, మే 25*

# చిత్రపురి కమిటీ అవినీతి పట్టదా..!

- కమిటీని రద్దుచేసి అడ్‌హక్‌కమిటీని ఏర్పాటు చేయాలి
- సినీ కార్మికులకు న్యాయం చేయాలి ..
- నవోదయం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్‌పటేల్



నిరాహార దీక్షలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న నవోదయం పార్టీ నాయకులు

కవాడిగూడ, మే 25 : అవినీతిలో కూరుకుపోయిన చిత్రపురి కమిటీని రద్దుచేసి అడ్ హక్ కమిటీని ఏర్పాటు చేసి.. సినీ కార్మికులకు న్యాయం చేయాలని నవోదయం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్రపురిలో జరిగిన కోట్లాది రూపాయల అవినీతిని బయటపెట్టి నిజమైన సినీ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నవోదయం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిత్రపురి కమిటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ చేసిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన కమిటీ సభ్యులను కాపాడుతున్న కోఆపరేటివ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. సింగిల్, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి సినీ కార్మికులకు అందుబాటు ధరలకు విక్రయించాలన్నారు. కమిటీ బహిరంగంగా అవినీతికి పాల్పడుతుంటే వారిని ప్రభుత్వం ఎందుకు కాపాడుతుందని ప్రశ్నించారు. కమిటీపై చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో చిత్రపురి కమిటీ అవినీతి ఇంకా పెరిగిపోతుందని ఆరోపించారు. కాలనీలో మిగిలిన రెండున్నర ఎకరాలలో చేపట్టిన నిర్మాణాలు సినీ కార్మికులకు కాకుండా ఇతరులకు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేసిన చిత్రపురి కాలనీ కో ఆపరేటివ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. చిత్రపురి కాలనీలో నూతనంగా నిర్మించబోయే ట్విన్ టవర్‌లో సింగిల్, డబుల్‌బెడ్ రూమ్‌లు నిర్మించి నిజమైన సినీ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. దీక్షా కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమారస్వామి, ఆప్ నాయకురాలు హేమ జిల్లోజు పాల్గొని మద్దతు పలికారు. ఈ నిరాహార దీక్షలో సినీ దర్శకులు మద్దినేని రమేశ్, నటి రమావేణి, కస్తూరి శ్రీనివాస్, మల్లేశ్, శ్రీను, నాగరాజు, రాజు, రాములు, జగన్, మ ల్లికార్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థానికి, నిజాయితీకి దర్పణం మాదాల వీరభద్రరావు



రమేశ్ బాబుకు పురస్కారాన్ని అందజేస్తున్న విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ గౌరీ శంకర్

చిక్కడపల్లి, మే 25: నిస్వార్థానికి, నిజాయితీకి దర్పణం మాదాల వీరభద్రరావు అని తెలుగు విశ్వవిదాలయిం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ గౌరీ శంకర్ అన్నారు. మాదాల వీరభద్రరావు స్మారక సమితి, సాధన సాహితి స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ కృష్ణ మందిరంలో ప్రముక సంపాదకులు, స్వాతంత్ర్య సమరయోధుడు మాదాల వీరభద్రరావు 105వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ గౌరీ శంకర్ హాజరయ్యారు. సందర్భంగా ప్రవర్ధమాన పాత్రికేయుడు ఎన్.రమేశ్ బాబుకు 2025వ మాదాల పురస్కారాన్ని అందజేశారు. సీనియర్ పాత్రికేయులు డా శంకర్ నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాధన నర్సింహాచార్య, మాదాల రాజేంద్రప్రసాద్, రఘు శ్రీ, రాయపోలు రమణ, కడియం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు, మాదిగ దండోరా కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి



అభివాదం చేస్తున్న బంధు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వీరస్వామి, భరత్ భూషణ్

చిక్కడపల్లి, మే 25: మాల మహానాడు, మాదిగ దండోరా కార్యకర్తలపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బంధు సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బంధు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లెల వీరాస్వామి, డా .అప్పికట్ల భరత్ భూషణ్ , ప్రొఫెసర్ ముత్తయ్య, ప్రొఫెసర్ నథానియేలు మాట్లాడుతూ.. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తరువాత షెడ్యూల్డ్ కులాల ఉమ్మడి రిజర్వేషన్లను ఆర్థిక, సాంఘిక వెనుకబాటు ఆధారంగా గ్రూపులుగా వర్గీకరించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ఆగస్టు 1, 2024 సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. తీర్పుకు అనుకూలంగా రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్డ్ కులాల ఉమ్మడి రిజర్వేషన్లను మూడు గ్రూపులుగా వారి వారి జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరించారని అన్నారు. అయితే.. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాట సమయంలో వర్గీకరణకు మద్దతుగా మాదిగ దండోరా కార్యకర్తలు, వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు కార్యకర్తలు నిర్వహించిన నిరసనలు, ధర్నాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో కేసులు పెట్టారని అన్నారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ తరువాత, రాష్ట్రాల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ నోటిఫికేషన్లు ఇవ్వడం జరిగిందని, ఉద్యోగానికి అర్హత కలిగిన అభ్యర్థులపై కేసులు ఉండటం వల్ల ఉద్యోగాలు కోల్పోడం జరుగుతుందని, మానవతా దృష్టితో ఉన్న కేసులను తక్షణమే ఉపసంహరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంజనేయులు, నర్సింగ్ , వశపాక నరసింహ పాల్గొన్నారు.

## అజంతా రైల్లో స్నాచింగ్

కాచిగూడ, మే 25: అజంతా రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. వెస్ట్ గోదావరికి చెంది కె.అనంతలక్ష్మి(53) అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గ మధ్య ఔరంగాబాద్ రైల్వే స్టేషన్‌లో అనంతలక్ష్మి మెడలో ఉన్న 31 గ్రాముల బంగారు చైన్‌ను గుర్తుతెలియని దుండగులు గొంగిలించారు. బాధితురాలు ఆదివారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఔరంగాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

**IN THE COURT OF HON'BLE PRL DIST JUDGE AT KARIMNAGAR.**
**A.S.No.34 OF 2022**
BETWEEN:-
**Sirikonda Rama Rao & another.** ...Appellants
AND
**G. Padma & others** ... Respondents
To
**R-3. P. Janaki, W/o. P.Rama Rao, Aged about 72 years, Occ: nil, R/o.A-4, Chandra Residency, Mahatma Nagar, Opp: Saaka Garden, Secunderabad.**
That the Appellants has filed the above **Appeal suit** against respondents No. 1 to 6, Respondents No.3 intentionally avoiding to receive the same, you are hereby summoned to appear in the court in person or by an Advocate, on **11-06-2025** at **10.30AM** to answer all material questions relating the above Appeal suit.
Take notice that if you fail to appear on **11-06-2025** at 10.30AM before the said court, you will be set ex-parte and the Appeal suit will be decided in your absence.
//By Ordeer Of the Court//
Sd/- **E.MADHUSUDHAN RAO**
Advocate
H.No.2-10-1492/A, Jyothinagar, Karimnagar Cell: 9440070774